క్లుప్తంగా

చౌటపల్లిలో డీపీవో ఆకస్మిక తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వరరావు

తాండూర్: మండలంలోని చౌటపల్లి గ్రామ పంచాయతీని గురువారం జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) వెంకటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య పనులు పరిశీలించి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు లేకుండా చూడాలని సూచించారు. గ్రామ పంచాయతీ రికార్డులు అప్‌డేట్ ఉంచుకోవాలని, తాగునీటి సమస్య ఏర్పడకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి వసంతను ఆదేశించారు. డీపీవో వెంట బెల్లంపల్లి డీఎల్‌పీవో షేక్ సఫ్దర్‌అలీ, మండల పంచాయతీ అధికారి అనిల్ కుమార్, కార్యదర్శి వసంత ఉన్నారు.

బెల్లంపల్లి విద్యార్థినికి రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు



సాత్విక

బెల్లంపల్లి: ఇంటర్మీడియెట్ బోర్డు ఇటీవల ప్రకటించిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో బెల్లంపల్లి విద్యార్థినికి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు వరించింది. బెల్లంపల్లికి చెందిన ప్రముఖ న్యాయవాది లగిశెట్టి రాము, చంద్రకళ దంపతుల కుమార్తే సాత్విక బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం హెచ్‌ఈసీ చదివింది. ఈ విభాగంలో సాత్విక ఏకంగా 967మార్కులు తెచ్చుకొని రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకును కైవసం చేసుకుంది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన సాత్వికను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, అధ్యాపకులు, పలువురు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

నేడు భూ భారతి చట్టంపై అవగాహన

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో భూ భారతి చట్టంపై శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ యూ.జ్యోత్స్న ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కన్నాల రైతువేదికలో ఉదయం 9గంటలకు అవగాహన సదస్సు ఉంటుందని, ఎమ్మెల్యే గడ్డం వినోద్, కలెక్టర్ కుమార్‌దీపక్, అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ హాజరవుతారని తెలిపారు. రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

తాండూర్: తెలంగాణ భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించడానికి శుక్రవారం తాండూర్ మండల కేంద్రంగా సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు సురభి గోదా క్షేత్ర ఫంక్షన్ హాల్లో సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సుకు కలెక్టర్ కుమార్‌దీపక్ హాజరవుతారని తెలిపారు. రైతులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడిగా రఘునాథ్



రామకృష్ణాపూర్: కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా పరిశీలకులుగా క్యాతనపల్లికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు, పీసీసీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డిని నియమించారు. పార్టీ మండల, బ్లాక్, డీసీసీ అధ్యక్షులను ఎన్నుకునేందుకు క్షేత్రస్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాలకు పరిశీలకులను పార్టీ నియమించిందని ఇందులో భాగంగా తనను కరీంనగర్ జిల్లా అబ్జర్వర్‌గా నియమించారని రఘునాథ్‌రెడ్డి తెలిపారు.

డీఏవోకు వినతి

బెల్లంపల్లి: ప్రభుత్వ పథకాలను అనర్హులకు కేటాయించే విధంగా ప్రభుత్వ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న కొంతమంది నాయకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పి.వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యాలయంలో డీఏవో కృష్ణ, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాసరావులకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని, పారదర్శకత లేకుండా కొంతమంది అధికారులు తప్పుడు సర్వే చేశారని విమర్శించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు సిఫారసు చేసిన వారి పేర్లు జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో తప్పుదోవ పట్టిస్తున్న నాయకులపై అధికారులు తగిన చర్యలు తీసుకొని తప్పిదాలు జరగకుండా చూడాలన్నారు. లేకపోతే ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు.



ఆండాళమ్మ కాలనీలోని డంపింగ్ యార్డులో చెత్తను శుద్ధి చేస్తూ...

గుట్టలుగా చెత్త!

- ఆలస్యమవుతున్న బయోమైనింగ్ ప్రక్రియ
- డంపింగ్ యార్డులో పేరుకుపోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్త
- వర్షాలు పడితే స్థానికులకు తీవ్ర ఇబ్బందులు



శుద్ధి చేసిన తర్వాత వేరుగా పోసిన బయోసాయిల్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధి ఆండాళమ్మ కాలనీలోని డంపింగ్ యార్డులో చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. గతంలో డంపింగ్ యార్డును ఆండాళమ్మ కాలనీలో ఏర్పాటు చేసే నాటికి, అక్కడ స్థానికంగా నివాసాలు లేవు. పట్టణ పరిధి పెరుగుతుండడంతో డంపింగ్ యార్డును ఆనుకొని ఆండాళమ్మ కాలనీ ఏర్పడగా గ్రీన్‌సిటీ, రంగంపేట్, పవర్ సిటీ కాలనీల్లో వందలాది కుటుంబాలు నివసిస్తున్నారు. ఇళ్లకు సమీపంలో డంపింగ్ యార్డు ఉండడంతో దుర్వాసన, మంటలు చెలరేగినప్పుడు పొగతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని పేరుకుపోయిన చెత్తను బయోమైనింగ్ ప్రక్రియ ద్వారా అందులోని చెత్తను వేరుచేసి, మట్టిని బయోసాయిల్‌లా మార్చి వినియోగించుకోవడంతో పాటు, పొలాలు, లోతట్టు ప్రాంతాలను నింపేందుకు దీనిని ఉపయోగించేలా ప్రణాళిక సిద్ధం చేసి, గతేడాది అక్టోబర్‌లో పనులు ప్రారంభించినా, ఇప్పటికీ పూర్తికాలేదు. పట్టణంలోని 36వార్డుల్లో ప్రతిరోజు 40మెట్రిక్ టన్నులకు పైగా చెత్త వెలువడుతుండగా, ప్రస్తుతం డంపింగ్ యార్డులో లక్ష మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయి గుట్టలుగా మారింది. ఏటా వర్షాకాలంలో దుర్వాసనతో పాటు, దోమలు, వ్యాధుల బారిన పడుతుండడంతో డంపింగ్ యార్డును వేరే చోటుకు మార్చడంతో పాటు, పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ప్రజల నుంచి డిమాండ్ బాగా పెరిగింది.

వర్షాలు పడితే కష్టమే...

జిల్లా కేంద్రంలోని ఆండాళమ్మ కాలనీలో తడి, పొడి చెత్తను పునర్వినియోగించాలనే ఉద్దేశంతో వర్మి కంపోస్టు కేంద్రాన్ని డంపింగ్ యార్డులోనే ఏర్పాటు చేశారు. గతంలో కొద్ది రోజులు తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు ఎరువుగా మార్చే ప్రక్రియను చేపట్టారు. కానీ కొద్ది రోజులకే దానిపై కార్పొరేషన్ అధికారులు పట్టనట్లుగా వ్యవహరించడంతో తడి, పొడి చెత్త అనే తేడా లేకుండా ఒకేచోట గుట్టలుగా చెత్త పేరుకుపోతూ వస్తోంది. ప్రతిరోజూ పట్టణం నుంచి 40మెట్రిక్ టన్నులకు పైగా చెత్తను వేస్తుండడంతో, 3ఎకరాల స్థలం మొత్తం చెత్తతో నిండిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం బయోమైనింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టగా, చాలా మున్సిపాలిటీల్లో బయోమైనింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. మంచిర్యాలలో పలు కారణాలతో ఏడాది నుంచి బయోమైనింగ్ ప్రక్రియ ఆలస్యం అవుతూనే ఉంది. గతేడాది అక్టోబర్‌లో పనులను ప్రారంభించి నాలుగు నెలల్లో పనులను పూర్తి చేసి, చెత్త లేకుండా చేయడం, చెత్తను తిరిగి వినియోగించేలా చేయాల్సి ఉండగా, ఏప్రిల్ నెల వచ్చినా ఇప్పటికీ పూర్తికాలేదు. పనులు ఆలస్యం కావడం, జూన్‌లోపు పూర్తికాకుంటే వర్షాలు పడితే పనులకు మరోసారి ఆటంకం కలిగే అవకాశం ఉంది.

వర్షాకాలంలోపు పూర్తి చేస్తాం



కార్పొరేషన్ పరిధిలోని ఆండాళమ్మ కాలనీలో గల డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త బయోమైనింగ్ ప్రక్రియను వర్షాకాలంలోపు పూర్తిచేసేలా చూస్తాం. ఇప్పటికే వారికి ఇచ్చిన టార్గెట్ ప్రకారంగా దాదాపుగా పూర్తి కావస్తుంది. ఇంకా చెత్త కొంత మిగిలిపోయి ఉన్నా, బయోమైనింగ్ చేయడం వల్ల డంపింగ్ యార్డులోని 70శాతంకు పైగా చెత్త తొలగించడం జరుగుతుంది.

– శివాజీ, కార్పొరేషన్ కమిషనర్

హాజీపూర్‌లో నవోదయ విద్యాలయం



స్థలాన్ని పర్యవేక్షిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే(ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గఢ్‌పూర్‌లో జవహర్ నవోదయ స్కూల్ మంజూరుకు నవోదయ విద్యాసమితి దాదాపుగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. స్కూల్ ఏర్పాటుకు సౌకర్యాలు కల్పించే అవకాశం ఉందని నవోదయ విద్యాసమితికి అధికార యంత్రాంగం నివేదిక ఇచ్చినట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు జవహర్ నవోదయ విద్యాలయాలు మంజూరు కాగా.. వాటిలో ఒకటి జిల్లాకు కేటాయించారు. ఆరు నెలల క్రితమే గఢ్‌పూర్‌లో 19 ఎకరాల స్థలాన్ని గుర్తించి అనుకూలంగా ఉంటుందని అధికారులు నివేదించారు. వచ్చే విద్యా సంవత్సరానికి స్కూల్ ప్రారంభించే అవకాశాలు లేనప్పటికీ ఒకవేళ అడ్మిషన్లు జరపాలని ఆదేశాలు వస్తే జిల్లాలో ఏదైనా అందుబాటులో ఉన్న అద్దె భవనంలో స్కూల్ నిర్వహణ చేపట్టే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. స్కూల్ ఏర్పాటు విషయంలో అధికారిక ప్రకటన రాకున్నా క్షేత్రస్థాయిలో అవసరమైన ఏర్పాట్లు దాదాపుగా కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది.

కార్పొరేట్ జీఎంకు సన్మానం



జీఎంను సన్మానిస్తున్న ఏరియా అధికారులు

శ్రీరాంపూర్: ఈ నెలాఖరుతో ఉద్యోగ విరమణ చేస్తున్న కార్పొరేట్ మెటీరియల్ ప్రొక్యూర్మెంట్ జీఎం సుబ్బారావును ఏరియా అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఏరియా జీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయన్ను అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ భీబత్సా, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారులు ఏ.వెంకటేశ్వర్‌రెడ్డి, టీ.శ్రీనివాస్, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, డీజీఎంలు అరవిందరావు, రవీందర్, మల్లయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి సమ్మర్ క్యాంప్

శ్రీరాంపూర్: సింగరేణి ఆధ్వర్యంలో శనివారం నుంచి సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీ ఉద్యోగుల పిల్లలకు శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో, నస్పూర్ కాలనీలోని సేవాభవన్, నాగార్జున కాలనీలోని ప్రాణహిత స్టేడియంలో క్యాంపులు ప్రారంభమవుతాయన్నారు. ప్రాణహిత స్టేడియంలో ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, ప్రగతి స్టేడియంలో బాక్సింగ్, బాస్కెట్‌బాల్, సేవా భవన్‌లో వాలీబాల్ క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాల లోపు బాలబాలికలు అర్హులన్నారు. మే 20 వరకు శిక్షణ కొనసాగుతుందని, రేపు సాయంత్రంలోగా ఆయా పీఈటీ లకు రిపోర్ట్ చేయాల్సిందిగా సూచించారు.

బొగ్గుబాయి వార్తలు

దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్‌లో వివిధ తరగతుల్లో అడ్మిషన్ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కూల్ కరస్పాండెంట్, ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్ పాఠశాల హెచ్‌ఎం పురుషోత్తం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 30వరకు గడువు ఉందని, ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్కూల్ ఆవరణలో సిబ్బందిని సంప్రదించి అడ్మిషన్ పొందాలని సూచించారు. సింగరేణి ఉద్యోగుల, నిర్వాసిత ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కొనుగోళ్లలో జాప్యం చేయొద్దు

- డీఆర్‌డీవో కిషన్



తేమశాతాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో కిషన్

దండేపల్లి: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు తేమశాతాన్ని పరిశీలిస్తూ, తూకం వేసి, బస్తాలను మిల్లులకు తరలించాలని డీఆర్‌డీవో కిషన్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. దండేపల్లి మండల కేంద్రంతో పాటు, నెల్కివెంకటాపూర్, మాదాపూర్, లింగాపూర్, అల్లీపూర్, గుడిరేవు, లక్ష్మీకాంతపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం సందర్శించారు. కొనుగోళ్లతీరు, సమస్యలను గురించి నిర్వాహకులతో మాట్లాడారు. లక్ష్మీకాంతపూర్‌లో మార్కెట్‌కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్‌తో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో ప్రసాద్, ఏపీఎం బ్రహ్మయ్య, ఏపీవో దుర్గప్రసాద్, సీసీలు, వీవోఏలు, వీవో లీడర్లు పాల్గొన్నారు.

మే డే ఉత్సవాలు విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పాతమంచిర్యాల: మే 01న నిర్వహించే మే డే ఉత్సవాలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఏఐటీయూసీ ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే డే ఉత్సవాలను కార్మిక వర్గం ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరించారు. కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రవాదుల దాడి మృతులకు సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు మిట్టపల్లి పౌలు, సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలీందర్ అలీఖాన్, సీపీఐ నాయకులు దాగం మల్లేష్, సరస్వతి పాల్గొన్నారు.

మే డే పోస్టర్ ఆవిష్కరణ

చెన్నూర్: తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో మే 1న నిర్వహించే మేడే బహిరంగ సభను విజయవంతం చేయాలని మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గురువారం ఆ సంఘ నాయకులు బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే మేడే బహిరంగ సభకు మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో చెన్నూర్ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు తోట సత్యం, సోహేల్, సమ్మయ్య, రాజు, తగరం మధు, శంకర్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత.. మనందరి బాధ్యత



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న అధికారులు

జైపూర్: జైపూర్: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని డివిజనల్ పంచాయతీ అధికారి ధర్మరాణి అన్నారు. జైపూర్ మండలం ఇందారం గ్రామ పంచాయతీలో పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ ప్రజలతో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీల్లో చెత్త చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని, గ్రామ ప్రజలు కూడా సహకరించాలని కోరారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ప్రజలతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించి, కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, పంచాయతీ కార్యదర్శి సుమన్, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

కాసిపేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో సబ్దర్ అలీ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

ప్లాట్‌ఫాం నిర్మించరూ!

దండేపల్లి: మండలంలోని ద్వారక గ్రామంలో నేతకానివాడలో గల చేతిపంపు వద్ద ప్లాట్‌ఫాం లేకపోవడంతో, స్థానికులు నీళ్లు పట్టుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. ప్లాట్‌ఫాం సమస్యతో పాటు నీళ్లలో చిలుము వస్తుందని కాలనీవాసులు పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి
సతీష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి
ఫోన్ నంబర్
83094 79738



పహల్గాం ఘటనపై మండిపడ్డ న్యాయవాదులు

- విధులు బహిష్కరించి నిరసన



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు



విధులు బహిష్కరిస్తున్న న్యాయవాదులు

మంచిర్యాలక్రైం/బెల్లంపల్లి/లక్సెట్టిపేట/చెన్నూర్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో టూరిస్టులపై దాడి చేసి 26మందిని పొట్టన పెట్టుకున్న దుశ్చర్యకు వ్యతిరేకంగా గురువారం జిల్లా కేంద్రంలో, బెల్లంపల్లి, చెన్నూర్, లక్సెట్టిపేటకు చెందిన న్యాయవాదులు విధులు బహిష్కరించి, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్, ఉపాధ్యక్షుడు సుంకరి భుజంగ్‌రావు, ప్రధాన కార్యదర్శి కే.మురళీకృష్ణ, సహాయ కార్యదర్శి ఆవునూరి సత్తయ్య, కోశాధికారి దత్తాత్రేయ, సీనియర్ న్యాయవాదులు నారాయణ, కమళమనోహర్‌రావు, మురళీధర్, నాగిరెడ్డి, మల్లరెడ్డి, ఆకుల రవీందర్, డేగ రవీందర్, అనిల్‌రాజ్, గూడ గోపి, లక్సెట్టిపేటలో బార్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, చెన్నూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్ది కార్తీక్, న్యాయవాదులు జేక సంజీవ్, ఎస్. రమేశ్, రాజేశ్, ప్రభాకర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

అమరులకు నివాళి



చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో...



శ్రీరాంపూర్: నివాళులర్పిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు

మంచిర్యాలటౌన్/శ్రీరాంపూర్/తాండూర్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వద్ద చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో గురువారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. శ్రీరాంపూర్ ఏరియా ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 కొత్తరోడ్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. తాండూర్ ఐబీ చౌరస్తా వద్ద క్రొవ్వొత్తులు వెలిగించి మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఉగ్రవాదులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అమరుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గుండ సుధాకర్, కార్యదర్శి ఇరుకుల్ల శ్రీనివాస్, కోశాధికారి చంద్రశేఖర్ శెట్టి, శ్రీరాంపూర్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు సదానందం, ఉపాధ్యక్షుడు నగేశ్, తాండూర్‌లో మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా తదితరులు పాల్గొన్నారు.

'తప్పుడు పత్రాలతో భూమి పట్టా'

బెల్లంపల్లి: బతికి ఉండగానే చనిపోయినట్లు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి, అక్రమంగా పట్టా చేయించుకున్న భూ ధ్రువీకరణ పత్రాలు అడిగితే అధికారులు ఇవ్వడం లేదని బాధితుడు, శ్రావ్యరెడ్డి మామ కుందూరు అశోక్ రెడ్డి అన్నారు. గురువారం విలేకరులతో తన గోడు వెళ్ల బోసుకున్నారు. నెన్నెల మండలం గంగారానికి చెందిన చిర్రం రమేశ్ నకిలీ పత్రాలతో చిన్నవెంకటాపూర్ గ్రామశివారులో తమ కోడలు శ్రావ్యరెడ్డి పేరుతో ఉన్న సర్వే నెంబర్ 132/2లో రెండెకరాల భూమి తమకు తెలియకుండానే పట్టా చేసుకున్నారని ఆరోపించారు. రమేశ్ రెవెన్యూ శాఖకు పొందుపరిచిన పత్రాలను అందజేయాలని కోరారు. అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై అనుమానాలు ఉన్నాయన్నారు.

నియామకం

జన్నారం: జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా మందమర్రికి చెందిన కొంగల తిరుపతి రెడ్డిని నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు జన్నారం మండల కేంద్రంలో నియామకపత్రాన్ని అందజేశారు.

సంక్షిప్త వార్తలు

చట్టాన్ని కఠినతరం చేయాలి

బెల్లంపల్లి: రాష్ట్రంలో వేముల రోహిత్ చట్టాన్ని తీసుకురావాలని కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ యత్నాలు చేయడం హర్షనీయమని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చట్టం కోసం రాహుల్ గాంధీ లేఖ రాయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపా రు. దళిత విద్యార్థులు వేధింపులకు గురికాకుండా వేముల రోహిత్ చట్టాన్ని తేవడానికి సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా వ్యవహరించాలని ఆయన కో రారు. చట్టాన్ని కఠినతరం చేసి భవిష్యత్‌లో విద్యార్థులు కుల వివక్షతకు గురికాకుండా, వేధింపుల బారిన పడకుండా చూడాలని ఆయన పేర్కొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడికి నివాళి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా కేంద్రంలోని గోసేవామండల్‌లో నివాసం ఉంటున్న స్వాతంత్య్ర సమరయోధుడు, శతాధిక వృద్ధుడు రేగళ్ల లక్ష్మణరావు ఈ నెల 10న మృతి చెందగా గురువారం ఆయన సంతాపసభ నిర్వహించారు. స్థానికులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


బంగారం, నగదు చోరీ

నెన్నెల: మండల కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన జంబిసెట్టి పోశాని అనే మహిళా కూలీ ఇంట్లో గురువారం చోరీ జరిగినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పోశాని తెల్లవారుజామున కూలీ పని కోసం బయటకు వెళ్లింది. ఉదయం 10గంటలకు వచ్చి చూడగా ఇనుప పెట్టె తాలం పగులగొట్టి ఉంది. తెరిచి చూడగా బంగారంతో పాటు రూ.83వేల నగదు కనిపించలేదు. పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయగా సంఘటన స్థలాన్ని బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దీన్ ఎస్సైతో కలిసి పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పని స్థలాల్లో నీటి సౌకర్యం కల్పించాలి

వేమనపల్లి: ఉపాధిహామీ పని స్థలాల్లో నీటి సౌకర్యం కల్పించాలని ఎంపీడీవో కుమారస్వామి అన్నారు. ఉపాధిహామీ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, వేసవి దృష్ట్యా గ్రామపంచాయతీల్లో నీటి సౌకర్యం కల్పించాలన్నారు.

'కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది'



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మందమర్రిరూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి, గెలిచాక అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని బీఆర్‌ఎస్ చెన్నూర్ ఇన్‌చార్జి రాజా రమేశ్ విమర్శించారు. గురువారం పట్టణంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశానికి హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రజల పక్షాన సమస్యలపై అధికారులను నిలదీయాలని సూచించారు. 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పహల్గాంలో అసువులు బాసిన వారికి నివాళులర్పించారు. సమావేశంలో బీఆర్‌ఎస్, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.